క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ బాపురావు

తాంసి: భీంపూర్ మండలం నిపాని గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ 16వ బ్రహ్మోత్సవాలు గత నాలుగు రోజులుగా కొనసాగుతున్నాయి. సోమవారం స్వామి వారికి తిరుమంజనం, అభిషేకం పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుకు ఆలయకమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామస్తులు ఐక్యంగా ప్రతిఏటా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ రాజన్న, ఆలయ వ్యవస్థాపకుడు శివదత్తగిరి మహరాజ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రామారావు, రెడ్డి రమేశ్ తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్స్ ప్రారంభం



చైర్మన్‌ను సన్మానిస్తున్న మహిళలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని శాంతినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటింగ్ సిస్టంను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను వార్డు కౌన్సిలర్ అలాల్ అజయ్‌తో కలిసి పరిశీలించారు. రంగవల్లుల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, మహిళలు చైర్మన్‌ను సన్మానించారు. కాలనీలో రూ.3 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై అట్రాసిటీ కేసు

ఇంద్రవెల్లి: మండలంలోని అందునాయక్తాండ గ్రామానికి చెందిన పడ్వాల్ ముఖేశ్ అనే యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు దళిత సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి ముఖేశ్‌ను జైలుకు తరలించినట్లు ఎస్సై డి.సునీల్ సోమవారం తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో మంగళవారం మండల రెడ్డిక యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేసు అమ్రేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కన్నె శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా ఆనంద్‌రెడ్డి, కార్యదర్శిగా రాజు, ఉప కోశాధికారిగా మాడవార్ హరీశ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా మాడ తిరుపతిరెడ్డి, సలహాదారుగా కట్కుర్ల నవీన్‌రెడ్డి, కుర్మ సాయిరెడ్డి, మనోజ్‌రెడ్డితో పాటు మరో ఆరుగురు సభ్యులతో కార్యవర్గాన్ని ఎనుకున్నారు. జిల్లా రెడ్డిక సంఘం ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో జిల్లా రెడ్డిక సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, సభ్యులు కన్నె ప్రభాకర్‌రెడ్డి, ఉషన్న రెడ్డి, భగవాండ్లు రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటివెలుగుపై అవగాహన

నేరడిగొండ: స్థానిక పీహెచ్‌సీలో కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన ఉంటుందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కోఆప్షన్ సభ్యులు, రాయిసెంటర్ సార్‌మేడీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

కరపత్రాలు విడుదల

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభ కరపత్రాలను ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, ఏపీవో భీంరావు, పీవీటీజీ ఏపీవో భాస్కర్, ఉపాధ్యక్షులు రాఘవులు, నాగోరావు తదితరులున్నారు.

మళ్లీ కలప దందా

- జిల్లాలో గుట్టుగా అక్రమ రవాణా
- మూడేళ్లుగా స్తబ్ధత
- చెక్‌పోస్టుల్లో తగ్గిన నిఘా



గతవారం క్రితం కలప తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న అటవీ అధికారులు (ఫైల్)

ఇచ్చోడ: జిల్లాలో మళ్లీ అక్రమ కలప స్మగ్లింగ్ షురూ అయింది. గత ఐదారు నెలలుగా స్మగ్లర్లు అటవీ ప్రాంతాల్లో టేకు చెట్లను నరికి కలప దందాను మళ్లీ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సిరికొండ, తాంసి, తలమడుగు, నేరడిగొండ, ఇంద్రవెల్లి మండల పరిధిలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతాలన్నీ గతంలో స్మగ్లర్ల గొడ్డలివేటుకు మైదానాలుగా మారిపోయాయి. కోట్ల విలువ చేసే టేకు కలపను జిల్లా సరిహద్దులు దాటవేశారు. గత మూడేళ్ల క్రితం సీఎం కేసీఆర్ అక్రమ కలప రవాణాపై సీరియస్‌గా తీసుకున్నారు. జంగిల్ బచావో..జంగిల్ బడావో అనే నినాదంతో అడవులను రక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అటవీ, పోలీసుశాఖ సంయుక్తంగా స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపి వారిపై పీడీ యాక్టులతోపాటు కేసులు నమోదు చేశారు. దీంతో జిల్లాలో కలప స్మగ్లింగ్‌కు బ్రేక్‌పడింది. కాని ఇటీవల మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా దందా మొదలైనట్లు తెలుస్తోంది.

మూడేళ్లుగా అజ్ఞాతంలో స్మగ్లర్లు

సీఎం ఆదేశాలతో అధికారులు చర్యలు ముమ్మరం చేయడంతో గత మూడేళ్లుగా కలప స్మగ్లర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గత కొన్నిరోజులు కిందట అటవీశాఖకు ప్రత్యేకంగా కేటాయించిన పోలీసులను వెనక్కి తీసుకోవడం, అడవుల్లో శాఖ సిబ్బంది నిఘా కొరవడంతో స్మగ్లర్లు మళ్లీ కలప దందా మొదలెట్టినట్లు తెలుస్తోంది.

చెక్‌పోస్టులపై తగ్గిన నిఘా..

ప్రభుత్వం మూడేళ్ల కిందట జిల్లా సరిహద్దులో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. అటవీ శాఖ సిబ్బందితో పాటు సాయుధ పోలీసులను నియమించింది. చెక్‌పోస్టుల వద్ద గస్తీ ఏర్పాటు చేయడంతో కలప స్మగ్లింగ్‌కు ఫుల్‌స్టాప్ పడింది. కాని గత రెండేళ్ల క్రితం నుంచి చెక్‌పోస్టుల వద్ద నియమించిన పోలీసు సిబ్బందిని వెనక్కి తీసుకోవడంతో మళ్లీ కథ మొదటికి వచ్చినట్లు తెలుస్తోంది. అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద కేవలం బీట్ ఆఫీసర్ స్థాయి అధికారుల పర్యవేక్షణ చేస్తుండటంతో నిఘా కొరవడినట్లు సమాచారం. ఇదే అదనుగా తీసుకున్న స్మగ్లర్లు గుట్టుచప్పుడు కాకుండా విలువైన టేకు కలపను చెక్‌పోస్టులను దాట వేస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు

- గత రెండు నెలల క్రితం తాంసి మండలంలోని లక్ష్మీపూర్ అటవీ ప్రాంతం నుంచి జిల్లా కేంద్రానికి వాహనంలో తరలిస్తున్న రూ.50 వేల విలువ కలపను అధికారులు పట్టుకున్నారు. తాంసి శివారులో రవాణాకు సిద్ధంగా ఉంచిన రూ.20 వేల కలపను పట్టుకున్నారు.
- గత రెండు నెలల క్రితం ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామంలో కార్డన్‌సెర్చ్‌లో భాగంగా రూ 1.50 లక్షల విలువ గల కలపను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- గత నెల కి‍్రతం నేరడిగొండ మండలం నాగమాల్యల్ వద్ద అటవీ ప్రాంతంలో స్మగ్లర్ల టేకు చెట్లను నరికి తరలించడానికి సిద్ధంగా ఉంచిన రూ 2 లక్షల కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- గతనెల కి‍్రతం ఇచ్చోడ మండలం గుండాల గ్రామంలో కార్డన్ సెర్చ్‌లో రూ. లక్ష విలువ గల కలపను స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 7న నేరడిగొండ మండలం లింగాట్లలో కార్డన్‌సెర్చ్‌లో కలపను పట్టుకున్నారు.
- ఈనెల 9న బోథ్ అటవీ ప్రాంతం నుంచి కలపను వాహనంలో తరలిస్తుండగా బోథ్ అటవీ అధికారులు పట్టుకున్నారు.

మళ్లీ నిజామాబాద్ కలప వ్యాపారులు రంగంలోకి ?

జిల్లా నుంచి మళ్లీ మొదలైన కలప రవాణాకు అండగా మళ్లీ నిజామాబాద్ జిల్లా కలప వ్యాపారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. గతకొన్నేళ్ల జిల్లా నుంచి కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న స్మగ్లర్లకు నిజామాబాద్ కలప వ్యాపారులు అండ ఉండేది. అయితే కలప స్మగ్లింగ్‌పై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం, నిజామాబాద్ జిల్లాలో ఉన్న కలప వ్యాపారులపై పోలీసులు కేసులు చేశారు. దీంతో అప్పటినుంచి కలప రవాణాకు అడ్డుపడింది. ఆదివారం నేరడిగొండలో స్మగ్లింగ్ పాల్పడుతూ పట్టుబడిన సంఘటనలో నిజామాబాద్ కలప వ్యాపారులు పట్టుబడ్డాడు.

పీడీ యాక్టులు నమోదు చేస్తాం

కలప స్మగ్లర్లపై పీడీ కేసులు నమోదు చేయడానికి ప్రభుత్వానికి నివేదిస్తాం. గతంలో స్మగ్లింగ్ పాల్పడిన వారిపై పీడీ కేసులు నమోదు చేశాం. అడవుల్లో తమ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. స్మగ్లంగ్‌కు పాల్పడుతున్న వారికి నిజామాబాద్ ప్రాంతం వారు సహకరిస్తున్న కోణంపై లోతుగా విచారణ చేస్తున్నాం. – బర్నోబా, ఎఫ్‌డీవో, ఇచ్చోడ

హాత్ సే హాత్ జోడోయాత్ర విజయవంతం చేయాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈనెల 26న ప్రారంభమయ్యే హాత్ సే హాత్ జోడోయాత్ర విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పార్టీ మండల కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ, ప్రియంక గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా హాత్ సే హాత్ జోడోయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండలం రాంపూర్ నుంచి ఈ యాత్ర ప్రారంభించే అవకాశం ఉందన్నారు. గ్రామ, గ్రామాన ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ హయంలో అభివృద్ధిని ప్రజల్లో తీసుకెళ్లడం, వరంగల్ రైతు డిక్లరేషన్‌పై అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ తరపున పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు సోమసే వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, ఎండీ జహీర్, రాజేశ్వర్, ముఖడే ఉత్తం, గాయక్వాడ్ భగవాన్, అజయ్, మానిక్‌రావ్, ఆత్రం కళ్యాణ్, అచపత్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వేణుయాదవ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్‌రూరల్: యాదవ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావ్‌లు హోమియోపతి వైద్యుడు డాక్టర్ రవికిరణ్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన వేణుయాదవ్‌ను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. యాదవ కులస్తులకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘువీర్ యాదవ్, అసుర హన్మండ్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ, సొసైటీ సభ్యులు

తలమడుగు: మండల కేంద్రంలోని 200 మంది పేదలకు ధారుల్ అన్సర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, వెల్ఫేర్ సభ్యులు వీటిని అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతిఏటా పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తున్న సొసైటీ సభ్యులను అభినందించారు. అనంతరం సభ్యులను సన్మానించారు. సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పద్మాకర్ రెడ్డి, సొసైటీ సభ్యులు రిజ్వాన్, అసిఫ్, మోసిన్, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్‌రావు, రఫిక్, సుంకిడి, ఎంపీటీసీ వెంకన్నయాదవ్, ఉప సర్పంచ్ సత్యపాల్, వీడీసీ చైర్మన్ ఆసవం రవీందర్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



నేరడిగొండ/సిరికొండ: గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచి ఆడపడుచులు ఇళ్ల ముందు ఆవు పేడతో చల్లి రంగు రంగులతో అందమైన ముగ్గులు వేశారు. ఆదివారం సంక్రాంతి జరుపుకోగా, సోమవారం కనుమ పండుగ జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహిళలు పిండి వంటకాలు చేశారు. కుటుంబీకులతో కలిసి అరగించారు. అనంతరం చిన్నారులు పతంగి ఆటలాడారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోండి



నార్నూర్‌లో మాట్లాడుతున్న రాథోడ్ జనార్దన్

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18 నుంచి కంటి వెలుగు వంద రోజుల కార్యక్రమాన్ని చేపడుతుందని, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ కోరారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభతోపాటు కంటి వెలుగు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఈ శిబిరాలు ఉంటాయని ఇవి తెలిసేలా తెలిసేలా డప్పు చాటింపు చేపట్టాలన్నారు. నార్నూర్ మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు తనవంతు సహకారం అందిస్తామన్నారు.

- గాదిగూడ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచులు, ఎంపీటీసీలతో ఎంపీడీవో సాయిప్రసాద్.. కంటి వెలుగుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 18 నుంచి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఒక రోజు ముందు గ్రామంలో డప్పు చాట్టింపు, కర పత్రాల పంపిణీ ద్వారా ప్రజలకు చైతన్యపర్చాలన్నారు. సమావేశంలో ఎంపీపీ అడ చంద్రకళరాజు, వైస్ ఎంపీపీ యోగేష్, వైద్యులు సంజీవ్, స్నేహ ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: ప్రజాసేవ చేయడంలో ఉన్న ఆనందం మరెందులో దొరకదని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న, మాజీ మంత్రి గేడం నగేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ పదవిలో ఉన్నప్పుడే కాకుండా ప్రజాసేవ చేయడంలో జడ్పీ చైర్మన్ జనార్దన్ ముందున్నారని కొనియాడారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుంర ఈశ్వరిబాయి, ఐటీడీఏ చైర్మన్ లక్కేరావు, సలీమ్, మర్సుకోల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగులో పాల్గొనేలా చూడాలి

తాంసి: కంటివెలుగులో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలని మండల ఇన్‌చార్జి, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం తాంసి ఆరోగ్య ఉపకేంద్రంలో కంటివెలుగు మాక్ డ్రిల్‌ను వైద్య సిబ్బందితో కలిసి నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామంలో 18 ఏళ్ల పైబడిన వారికి ఆహ్వానపత్రాలు అందజేసి పరీక్షలు చేపట్టాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఎంపీడీవో భూమయ్య, తాంసి వైద్యాధికారి శివాని, సూపర్‌వైజర్ తులసీరాం, హెల్త్ అసిస్టెంట్ నగేష్, ఏఎన్‌ఎంలు సుగుణ, లక్ష్మి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నేడు నాయీబ్రాహ్మణ సంఘ సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: నాయీబ్రాహ్మణ సంఘ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు నిర్వహిస్తున్నట్లు సంఘం బాధ్యులు శ్రీనివాస్, అంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ కమిటీ ఎన్నికపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు బీసీ సంక్షేమ సంఘం సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈర్ల సత్యనారాయణ, కోరెడ్డి పార్థసారథి ప్రకటనలో తెలిపారు. సంఘ పదవీ గడువు ముగిసినందున ఎన్నికల నిర్వహణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇన్నేళ్లు సహకరించిన వారికి ధన్యవాద సమర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని బీసీ, కుల సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బోగస్ ఇంటి నంబర్లు సృష్టించేవారిపై చర్యలు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ హయాంలో మంజూరు చేసిన పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని ఇళ్లకు కొంత మంది అధికార పార్టీ నాయకులు బోగస్ ఇంటి నంబర్లు సృష్టించి వాటితో రిజిస్ట్రేషన్ చేసుకుని అర్హులైన వారికి అన్యాయం చేస్తున్నారని మాజీ కౌన్సిలర్, బీజేపీ నాయకుడు మేస్రం కృష్ణ ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం అడిషనల్ కలెక్టర్ నటరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. 170 సర్వే నంబర్ తరహాలో ఒక్కో ప్లాట్‌కు మూడు డాక్యుమెంట్లు సృష్టించి లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారన్నారు. ఇంటి డోర్ నంబర్లు, డాక్యుమెంట్లు పరిశీలించి ప్రభుత్వం కేటాయించిన లబ్ధిదారులకు అందించేలా చూడాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అరవింద్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా మాజీ ఎంపీ నగేశ్ ఆయన్ను పరామర్శించారు. ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. ఘన్‌పూర్‌లో సోమవారం యువతకు వాలీబాల్ కిట్ సర్పంచ్ లతతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నాగోబా జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అంధత్వ నివారణకు సహకరించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: అంధత్వ నివారణకు అందరూ సహకరించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కంటి పరీక్షల కార్యక్రమంపై ట్రయల్ రన్‌లో భాగంగా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వాన్ని పూర్తిగా దూరం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18 నుంచి రెండో విడత ×కంటి వెలుగు÷ను ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించే పరికరాలతో వైద్యాధికారి ఎండీ సద్దాం అవగాహన కల్పించారు. ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, సర్పంచ్ పెంట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు



జైనథ్: చిన్నారులకు కేక్ తినిపిస్తున్న నాయకులు



ఇచ్చోడలో కేక్ కట్ చేస్తున్న బీఎస్పీ నాయకులు

జైనథ్: బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేసారు. అనంతరం మిఠాయిల, కేక్‌లు పంచి సంబరాలు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, జిల్లా ఇన్‌చార్జీలు మెస్రం జంగు బాపు, రత్నపురం రమేశ్, నాయకులు లక్ష్మణ్, పొచ్చన్న, శ్రీహరి, కృష్ణ సృజన్, హరినాథ్, శ్రీను, అరవింద్, రవీందర్, ప్రశాంత్, శివ, సతీశ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జరిగిన జన్మదిన వేడుకల్లో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మెస్రం జంగుబాబు, జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, అర్గనైజింగ్ సెక్రెటరీ పోశెట్టి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌరస్తా వద్ద జరిగిన మాయావతి జన్మదిన వేడుకల్లో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్, మహిళా జిల్లా కన్వీనర్ ప్రేమకల, నాయకులు మెస్రం మీనా, లక్ష్మణ్ యాదవ్, సృజన్, అరవింద్, పవన్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



బహుమతులు ఇస్తున్న రవికిరణ్ యాదవ్, గణేశ్‌రెడ్డి

తలమడుగు: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సినీ నిర్మాత డాక్టర్ రవికిరణ్ యాదవ్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని లచ్చంపూర్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారంతో ముగింపు సందర్భంగా ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న విలేజ్ లెవల్ జట్టుకు జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు అడే గజేందర్ కలసి రూ.30 వేల నగదు అందజేశారు. ఆదిలాబాద్‌లోని సుభాష్‌నగర్ జట్టు క్రీడాకారులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. వీరికి సినీ నిర్మాత, సాయి వైకుంఠట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ రూ.15 వేల నగదును అందజేశారు. జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు రఘువీర్ యాదవ్, ఉపాధ్యాయులు నవీన్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, సర్పంచ్, రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్‌రావు, రఫిక్, మహేందర్ యాదవ్, గ్రామస్తుడు రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బోథ్: నియోజకవర్గంలోని 20 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ ఆదిలాబాద్‌లోని తన నివాసంలో సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రూ.6,70,000 విలువ గల చెక్కులను అందజేశారు. కాగా, బోథ్ మండలంలోని 6వ వార్డు సభ్యులు సర్పంచ్ సురేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. మహంకాళి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. ప్రహరీతోపాటు ఫ్లోరింగ్ కోసం రూ.3 లక్షలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

బహుమతుల ప్రదానం

తలమడుగు: మండలంలోని దేవపూర్‌లో హిందు ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు ఎస్సై ప్రవళిక, బీజేపీ నాయకురాలు చిల్యాల సుహాసిని బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి శాగంటి సాహితి, అపర్ణ (ద్వితీయ), కళ్యాణి(తృతీయ) బహుమతులు అందజేశారు. హిందుధర్మ జాగరణ సమితి సభ్యులు, బీజేవైఎం నాయకుడు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

నేరడిగొండ: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. తేజపూర్ గ్రామంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ ప్రఫుల్ చందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

సిరికొండ: ఆటల్లో గెలుపోటములు సహజమని సిరికొండ ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న అన్నారు. మండల కేంద్రంలో సిరికొండ యువసేన ఆధ్వర్యంలో గత 15 రోజుల నుంచి కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిశాయి. కాగా, సిరికొండ, హీరాపూర్ ఫైనల్ మ్యాచ్‌లో హీరాపూర్ గెలుపొంది ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి సిరికొండ టీమ్ విజయం సాధించింది. ఈ జట్లకు బహుమతులు అందించారు. మాజీ సర్పంచ్ ఓరగంటి పెంటన్న, యువసేన అధ్యక్షుడు సాయిని స్వామి, సభ్యులు పాల్గొన్నారు.